





# మన మహతి న్యూస్

సత్యం... సమగ్రత... సమాజం కోసం...

నిజమైన వార్తలు | నిర్భీక విశ్లేషణ | ప్రజల గొంతుక


ఎడిటర్ :డాక్టర్. ప్రకాష్ జాదవ్ | సోమవారం సెప్టెంబర్ 07, 2026 | సంపుటి : 01 సంచిక : 203 | పేజీలు 8 వెల-5/- MANAMAHATINEWS.COM

## గాల్లో ఉండగా సాంకేతిక సమస్య..
## విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్

టేకాఫ్ అయిన కొంత సేపటికే విమానంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో వెనక్కి తిరిగి వచ్చింది.





విమానాన్ని అరగంటకు పైగా గాలిలో చక్కర్లు కొట్టించారు

టేకాఫ్ అయిన కొంత సేపటికే విమానంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో వెనక్కి తిరిగి వచ్చింది. ఈ ఘటన బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయంలో చోటుచేసుకుంది. విమానాశ్రయ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. వర్జిన్ అట్లాంటిక్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం ఆదివారం ఉదయం 8.20 గంటలకు లండన్‌కు బయలుదేరింది.

టేకాఫ్ అయిన కొద్ది సేపటికే విమానంలో సాంకేతిక సమస్య తలెత్తినట్లు గుర్తించిన పైలట్లు విమానాశ్రయ అధికారులను అప్రమత్తం చేశారు. విమానాన్ని అరగంటకు పైగా గాలిలో చక్కర్లు కొట్టించారు. అనంతరం వెనక్కి తీసుకువచ్చి విమానాశ్రయంలో 'ఎమర్జెన్సీ ల్యాండింగ్' (జుఎవతీస్త్రవఅషెఎ ఞ్ఖుఅఎఱఅస్త్ర) చేశారు. ఘటన జరిగిన సమయంలో విమానంలో సిబ్బంది సహా మొత్తం 270మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రయాణికులను సురక్షితంగా కిందకు దించి, విమానాన్ని తనిఖీలకు తరలించారు. ఘటనపై డీజీసీఏ అధికారులు దర్యాప్తు చేపట్టారు.

2లో

## అమెరికా నుంచి బంగారం ఎందుకు
## తరలిపోతోంది?

ప్రపంచ అనిశ్చితితో దేశాలు ముందుజాగ్రత్త పడుతున్నాయి.



- నెదర్లాండ్స్ 86 టన్నులు లండన్‌కు తరలించింది.
- జర్మనీ 111 టన్నులు న్యూయార్క్ నుంచి తరలించింది.
- ఫ్రాన్స్ కూడా బంగారాన్ని తరలించింది.
- యుద్ధాలు, సుంకాలు ఆర్థిక ఆందోళనలు పెంచుతున్నాయి.
- లండన్ సురక్షిత కేంద్రంగా పేరొందింది.
- బంగారం విక్రయాలు లండన్‌లో సులభం.

మిగతాది 2లో

## హెల్త్ కార్డుల విషయంలో సీఎం నిర్ణయం సంతోషపెట్టింది: ఏపీ జేఏసీ



మిగతాది 2లో

## వెలిగొండ ఫీడర్ కెనాల్‌లో యువకుల గల్లంతుపై మంత్రుల ఆరా



మిగతాది 2లో

## బీఆర్ఎస్ వైఖరి మారకపోతే..

### మరో పదేళ్లూ రోడ్లపైనే: మంత్రి శ్రీధర్ బాబు

- కాంగ్రెస్ జవాబుదారీతనంతో పని చేస్తోంది.
- బీఆర్ఎస్ నేతలు అసెంబ్లీకి వస్తే సమాధానం ఇస్తాం.
- కేసీఆర్ సభకు వచ్చి అనుభవం పంచుకోవాలి.
- సోషల్ మీడియా విష ప్రచారాన్ని తిప్పికొట్టాలి.



భారత రాష్ట్ర సమితి నేతలతో రోడ్లపై మాట్లాడించడం కాదు.. అసెంబ్లీకి వస్తే సమాధానం చెప్తామని తెలంగాణ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. పదేళ్లు సీఎంగా పనిచేసిన కేసీఆర్ సభకు వచ్చి.. వారి అనుభవాన్ని పంచుకోవాలన్నారు. ఇందిరాపార్క్ వద్ద పీసీసీ ఆధ్వర్యంలో చేపట్టిన మహాధర్నాలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజహరుద్దీన్‌తో పాటు ముఖ్యనేతలు జగ్గారెడ్డి, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ జవాబుదారీతనంతో పని చేస్తోందన్నారు. "విపక్షాలు సోషల్ మీడియాలో చేస్తున్న విష ప్రచారాలను తిప్పికొట్టాలి. ఆర్టీసీ బస్సుల్లో కాంగ్రెస్ కార్యకర్తలు మాత్రమే ఉచిత ప్రయాణం చేస్తున్నారా? పేదల ఇళ్లకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం.

పేజి 2లో ▶

## ఏపీలో కొత్త పింఛన్లు..
## దరఖాస్తులకు ప్రభుత్వం శ్రీకారం






అమరావతి: ఏపీలో కొత్త పింఛన్ల కోసం దరఖాస్తుల స్వీకరణకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు సహా వివిధ వర్గాల నుంచి సెప్టెంబర్ 7 నుంచి 16 వరకు దరఖాస్తులు స్వీకరించనుంది. స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి.. దరఖాస్తుల పరిశీలన, అర్హత నిర్ధరణ అనంతరం దశలవారీగా కొత్త పింఛన్లు మంజూరు చేయనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 61,92,396 మంది పింఛనుదారులకు నెలకు రూ.2,694 కోట్ల మేర పంపిణీ చేస్తుండగా.. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు పింఛన్ల కోసం రూ.73,508 కోట్లు ఖర్చు చేసింది.

## ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని
## నిలదీయాలి..
## కేసీఆర్ దిశానిర్దేశం




### బీఆర్ఎస్ఎల్పీ సమావేశంలో పార్టీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు కేసీఆర్ దిశానిర్దేశం




- అసెంబ్లీ సమావేశాలకు అందరూ తప్పకుండా హాజరుకావాలి
- ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలి
- కాంగ్రెస్, బీజేపీ విధానాలను ఉభయసభల్లో ఎండగట్టాలి
- కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన అట్టర్‌ఫ్లాప్
- రేవంత్ చిల్లర మాటలు మాట్లాడుతున్నారు
- స్పీకర్ పక్షపాత వైఖరిపై కేసీఆర్ ఆగ్రహం

బీఆర్ఎస్ఎల్పీ సమావేశంలో పార్టీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. రేపటి నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో కేసీఆర్ మాట్లాడారు.. అసెంబ్లీ సమావేశాలకు అందరూ తప్పకుండా హాజరుకావాలన్నారు. శాసనసభ, మండలిలో జరిగే ప్రతి చర్చలో పాల్గొనాలి. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలి. కాంగ్రెస్, బీజేపీ విధానాలను ఉభయసభల్లో ఎండగట్టాలన్నారు.

సీఎం రేవంత్ అసెంబ్లీలో, బయట బూతులు మాట్లాడుతున్నారని కేసీఆర్ ఫైర్ అయ్యారు. పాలన చేతకాక ఈ తరహాలో వ్యవహరిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పాలన అట్టర్‌ఫ్లాప్ అని అన్నారు. కాంగ్రెస్ థర్డ్ క్లాస్ పాలన కొనసాగిస్తోంది. కాంగ్రెస్ పోవడం ఖాయమని అర్థమైంది. రేవంత్ చిల్లర మాటలు మాట్లాడుతున్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి ఖాయం. ఈ విషయం ఆ పార్టీ నేతలకు అర్థమైంది. అందుకే ఈ దోపిడీ చేస్తున్నారు. స్పీకర్ పక్షపాత వైఖరి అప్రజాస్వామికమన్నారు. సభలో స్పీకర్ పక్షపాత వైఖరితో వ్యవహరిస్తున్నారని కేసీఆర్ వేలెత్తిచూపారు.

పేజి 2లో ▶

## గ్రామ నిధులు నేరుగా సర్పంచులకే అందేలా త్వరలో కొత్త బిల్లు: మంత్రి సీతక్క



మిగతాది 2లో

## ఫోక్ డ్యాన్సర్ మాధురి రాథోడ్ ఆత్మహత్యాయత్న



మిగతాది 2లో

# సంపాదకీయం

## రేవంత్‌కు రెండో చాన్స్ ఉందా...

ఇల్లు అలకగానే పండుగ కాదు అన్నట్టుగా రేవంత్‌రెడ్డి పరిస్థితి ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజల్లో ఏర్పడుతున్న వ్యతిరేకతను పోగొట్టడానికి ఆయనకు నికరంగా ఏడాది మాత్రమే సమయం మిగిలి ఉంది. చివరి సంవత్సరంలో ఎన్ని విన్యాసాలు చేసినా ప్రజాభిప్రాయం మారదు.

తాను బలపడుతూ, పార్టీ కూడా బలపడేలా చేయాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్‌పైన పడింది. కొండా సురేఖ ఎపిసోడ్‌లో పార్టీ అధిష్ఠానం అండగా నిలబడటం రేవంత్‌కు ఒకింత ఊరట కలిగించే అంశమే.

తెలుగునాట రెండో పర్యాయం అధికారంలోకి రావడం అంత ఆషామాషీ కాదు. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు, వైఎస్ రాజశేఖర రెడ్డి, రాష్ట్రం విడిపోయిన తర్వాత కేసీఆర్ మాత్రమే రెండో పర్యాయం అధికారంలోకి రాగలిగారు.

పార్టీ ఏదైనా మొత్తం యంత్రాంగం ఒక్కటిగా నిలబడి ముఖ్యమంత్రిని మోసిన సందర్భాలలోనే చంద్రబాబు అయినా, రాజశేఖర రెడ్డి అయినా, కేసీఆర్ అయినా రెండోమారు అధికారంలోకి రాగలిగారు. మొత్తం పార్టీ యంత్రాంగం ముఖ్యమంత్రులను సొంతం చేసుకోని సందర్భాలలో ఇదే నాయకులు ఓడిపోయారు.

ముఖ్యమంత్రి రేవంత్ మళ్లీ అధికారంలోకి రావాలంటే ముందుగా మొత్తం కాంగ్రెస్ పార్టీ ఆయనను సొంతం చేసుకోవాలి. కార్యకర్తల నుంచి నాయకుల వరకు అందరూ రేవంత్ నాయకత్వానికి జై కొట్టాలి. అలా అందరూ తన నాయకత్వాన్ని ఆమోదించేలా చేసుకోవాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్‌పైన కూడా ఉంటుంది. కాంగ్రెస్ అధిష్ఠానం అండదండలు కూడా ఉన్నందున తనను తాను బలమైన నాయకుడిగా తీర్చి దిద్దుకోవడానికి రేవంత్‌కు ఇదొక సదవకాశం.

కాంగ్రెస్‌లో గ్రూపులు ఉండటం చూసి ఆశ్చర్యపోకూడదు. లేకపోతే ఆశ్చర్యపోవాలి. ఎన్నికల్లో గెలవడానికి సామాజిక సమీకరణలు మాత్రమే సరిపోవు. మొత్తంగా ప్రజల్లో సానుకూల అభిప్రాయం ఏర్పడాలి. అదే సమయంలో సీఎం ఎవరైనా వారి నాయకత్వం పట్ల ప్రజల్లో కూడా విశ్వాసం ఏర్పడాలి.

రేవంత్ కూడా సీఎంగా ఐదేళ్లపాటు కొనసాగి పూర్తి కాలం పదవిలో ఉంటారని అనడంలో ప్రస్తుతానికి సందేహం లేదు. కాంగట?్రస్‌లో ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉండటమే ఒక రికార్డు. అలాంటిది రెండో పర్యాయం పార్టీని గెలిపించుకొని అధికారంలో కొనసాగడం గొప్ప విషయమే అవుతుంది.

పార్టీలోని అన్ని గ్రూపులను తన వైపునకు మళ్లించుకొని అందరూ రేవంత్ గ్రూపు మాత్రమే అని రుజువు చేసుకోగలిగినప్పుడే ఆయన శక్తి సామర్థ్యాలు వెల్లడవుతాయి. రాజకీయ ప్రత్యర్థుల నుంచి ఎదురయ్యే దాడుల నుంచి తప్పించుకొని బలంగా నిలబడే వారే నిజమైన నాయకుడిగా ఆవిష్కృతుడవుతారు.

తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో కొండా సురేఖ వ్యవహారం టీ కప్పులో తుపానుగా చల్లబడిపోతుందా? లేక మునుముందు కొత్త సవాళ్లకు దారి తీస్తుందా? ఇది ఇప్పటికిప్పుడు చెప్పలేని పరిస్థితి. సురేఖ ఎపిసోడ్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ హైకమాండ్ వద్ద తన మాట నెగ్గించుకుని... ఆమెను బర్తరఫ్ చేసి పార్టీలో--ప్రభుత్వంలో తన పట్టు పెంచుకున్నట్టు కనిపిస్తున్నారు. కానీ, సవాళ్లు మాత్రం తొలగిపోలేదు. తెలంగాణ కాంగ్రెస్ పైకి ఒక్కటిగా కనిపిస్తున్నా అంతర్గతంగా మూడు గ్రూపులుగా ఉంది. ఇప్పటి వరకు అచ్చ కాంగ్రెస్, పచ్చ కాంగ్రెస్ అని రెండు గ్రూపులు ఉండగా... ఇప్పుడు రాజశేఖరరెడ్డి వర్గం కూడా తెర మీదకు వచ్చింది. పార్టీలో ప్రత్యర్థులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పచ్చ కాంగ్రెస్ ప్రతినిధిగా అభివర్ణిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ నుంచి వచ్చిన వారిని పచ్చ కాంగ్రెస్ వాళ్లు అని అంటున్నారు. అయితే, తెలంగాణ ఏర్పడిన తర్వాత అచ్చ కాంగ్రెస్ నాయకులుగానీ, రాజశేఖరరెడ్డి వర్గంగానీ పార్టీని అధికారంలోకి తీసుకురాలేకపోయారు. చివరకు తెలుగుదేశం పార్టీ నుంచి వచ్చిన రేవంత్‌రెడ్డి చేతికి పార్టీ పగ్గాలు అప్పగించిన తర్వాత 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఈ వాస్తవాన్ని గుర్తించిన కాంగ్రెస్ అధిష్ఠానం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఎన్ని ఫిర్యాదులు అందినా ఆయా సందర్భాలలో అండగా నిలిచింది. తాజాగా సురేఖ ఉదంతంలో కూడా ముఖ్యమంత్రి అభిప్రాయానికి విలువ ఇచ్చి ఆమెను బర్తరఫ్ చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే... పార్టీ అధిష్ఠానం ఈ నిర్ణయం తీసుకునే ముందు దాన్ని అడ్డుకొనే ప్రయత్నాలు జరగకపోలేదు. ఇద్దరు ముగ్గురు మంత్రులు బర్తరఫ్ నిర్ణయాన్ని అడ్డుకొనే ప్రయత్నం చేశారు. ఈ కారణంగానే నిర్ణయం తీసుకోవడంలో జాప్యం జరిగింది. కొండా సురేఖను బర్తరఫ్ చేయనిస్తే రేవంత్‌రెడ్డి బలపడతారన్న ఉద్దేశంతోనే ఈ ప్రయత్నాలు జరిగినట్టు చెబుతున్నారు. అయితే, రేవంత్‌రెడ్డిని కాదనుకునే పరిస్థితి లేకపోవడం, జరిగిన దానిపట్ల విచారం వ్యక్తం చేయడానికి కూడా సురేఖ సిద్ధపడకపోవడంతో పార్టీ అధిష్ఠానం బర్తరఫ్ నిర్ణయం వైపు మొగ్గు చూపాల్సి వచ్చింది.

### ఏమిటి కారణం...

ఈ మొత్తం వ్యవహారంలో కొండా సురేఖది స్వయం కృతాపరాధమా? లేక వ్యూహాత్మకమా? అన్నది ఇప్పుడే చెప్పలేం. గతంలో కూడా ఆమె దుందుడుకు నిర్ణయాలు తీసుకున్న చరిత్ర ఉంది. కాంగ్రెస్ పార్టీలో ఆమె రాజశేఖరరెడ్డి అనుచరురాలిగా ఉండేవారు. రాజశేఖరరెడ్డి మరణానంతరం జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావాలని కోరుకున్నారు. అయితే, పార్టీ అధిష్ఠానం మాత్రం కొణిజేటి రోశయ్యను ముఖ్యమంత్రిగా ఎంపిక చేసింది. దీంతో కినుక వహించిన సురేఖ మంత్రి పదవికి రాజీనామా చేసి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయితే తెలంగాణ వాదులు జగన్మోహన్‌రెడ్డిని తీవ్రంగా వ్యతిరేకించారు. ఫలితంగా తెలంగాణలో ఆయన తన దుకాణం మూసుకోవలసి వచ్చింది. దీంతో సురేఖ తెలంగాణ రాష్ట్ర సమితిలో చేరి ఎమ్మెల్యే అయ్యారు. అక్కడ కూడా ఇమడలేక ఆమె మళ్లీ కాంగ్రెస్‌లో చేరారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో మూడు గ్రూపులలో ఒకటైన రాజశేఖరరెడ్డి వర్గం విషయానికి వద్దాం! రాజశేఖరరెడ్డిని విపరీతంగా అభిమానించిన వర్గం తమ ప్రాంతానికి చెందిన రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని మాత్రం అంగీకరించలేకపోతోంది. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈ వర్గంలో ఉన్నవారందరికీ ఏవో మేళ్లు చేశారని చెబుతున్నారు. ఈ కారణంగానే వారందరూ వైఎస్ఆర్‌ను అభిమానిస్తూ వచ్చారు. ఆర్థిక ప్రయోజనాలు కలిగించే మేళ్లు చేయడంతో పాటు రాజశేఖరరెడ్డి ఆప్యాయత ప్రదర్శించేవారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి విషయంలో ఆప్యాయతతోపాటు ఆర్థిక ప్రయోజనం కలిగించే మేళ్లు కరువయ్యాయని చెబుతున్నారు. ఈ కారణంగానే తెలంగాణలో రాజశేఖరరెడ్డి రాజ్యం తెస్తామన్న మాటలు వినిపిస్తున్నాయి. ఇక ఒరిజినల్ కాంగ్రెస్ పార్టీ విషయానికి వద్దాం! గత వారం నేను చెప్పినట్టుగా తెలంగాణ కాంగ్రెస్‌లో నాయకులు బలంగా ఎదగకుండా రాజశేఖరరెడ్డి అడ్డుకున్నారు. ఈ కారణంగానే 2014 ఎన్నికల్లో పార్టీ గెలుస్తుందో లేదో తెలియకపోయినా అనేక మంది ముఖ్యమంత్రి అభ్యర్థులుగా తెరమీదకు వచ్చారు. ఫలితంగా ఎన్నికల్లో పార్టీకి సారథ్యం వహించగల నాయకులు కరువయ్యారు. చివరకు తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేసినా కాంగ్రెస్ మాత్రం అధికారానికి ఆమడ దూరంలోనే ఆగిపోయింది. గాలి వాటంగా పార్టీ అధికారంలోకి వస్తే ముఖ్యమంత్రి కావాలనుకున్నారే కానీ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి ఎవరూ బాధ్యత తీసుకోలేకపోయారు. ఈ నేపథ్యంలోనే రాహుల్‌గాంధీ పార్టీ పగ్గాలను రేవంత్‌రెడ్డికి అప్పగించారు. దీంతో కాంగ్రెస్ పార్టీలో పచ్చ కాంగ్రెస్ అని ప్రత్యర్థులు పిలుచుకొనే మూడో వర్గం అవతరించింది. ఈ వర్గంలోని వారందరూ అప్పటి వరకూ ఏక నాయకత్వంలోని తెలుగుదేశం పార్టీలో ఉండి వచ్చినవారే. చంద్రబాబు నాయకత్వంలో ఆయన సలహాలు సూచనల మేరకు పనిచేసినవారు కనుక కాంగ్రెస్ సంస్కృతిని ఒంటబట్టించుకోలేకపోయారు. ఇప్పటికీ కాంగ్రెస్‌లోని ఈ వర్గానిది అదే పరిస్థితి. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విషయమే తీసుకుందాం. ఇప్పుడు ఉన్న మంత్రులందరికంటే ఆయనే సీనియర్. ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు, కేసీఆర్ మంత్రివర్గాలలో ఆయన పనిచేశారు. అయితే, కాంగ్రెస్ పార్టీలో మాత్రం ఆయనను జూనియర్‌గానే చూస్తారు. తుమ్మలకు కూడా కాంగ్రెస్ అధిష్ఠానం అంటే ఏమిటో, వారితో ఎలా మెలగాలో తెలియదు. రేవంత్‌రెడ్డి కారణంగానే ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంత్రి సీతక్కది కూడా ఇంచుమించు ఇదే పరిస్థితి. కాంగ్రెస్ సంస్కృతి ఒంటబట్టకపోవడం వల్ల ఈ వర్గం ఒకింత అసౌకర్యానికి గురవుతోంది. ఇప్పుడు ఈ మూడు వర్గాలనూ సమన్వయం చేసుకుంటూ తాను బలపడుతూ, పార్టీ కూడా బలపడేలా చేయాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పైన పడింది.

### రెండోసారి ఈజీ కాదు...

సురేఖ ఎపిసోడ్‌లో పార్టీ అధిష్ఠానం అండగా నిలబడటం రేవంత్‌రెడ్డికి ఒకింత ఊరట కలిగించే అంశమే. అయినప్పటికీ ఇల్లు అలకగానే పండుగ కాదు అన్నట్టుగా ఆయన

## అమెరికా నుంచి బంగారం ఎందుకు తరలిపోతోంది?

మొదటిపేజీ తరువాయి

యుద్ధాల అనిశ్చితి కొనసాగుతుండగానే... వివిధ దేశాలు అమెరికా నుంచి బంగారాన్ని తరలిస్తుండటం అంతర్జాతీయంగా చర్చనీయాంశమవుతోంది. గత వారం నెదర్లాండ్స్ ఇప్పటిదాకా తాను అమెరికాలో దాచుకున్న బంగారాన్ని లండన్‌కు బదిలీ చేయటం తాజా పరిణామం. కారణమేంటంటే... 'సంక్లిష్ట సంక్షోభానికి ముందస్తు తయారీ' అంటూ నెదర్లాండ్స్ బదులివ్వటం ఆసక్తికరం! ఇంతకూ ఏం జరుగుతోంది? ఎందుకని అమెరికా నుంచి బంగారాన్ని వివిధ దేశాలు తరలిస్తున్నాయి?

నెదర్లాండ్స్ ఒక్కటే కాదు... కొద్దికాలం ముందు ఫ్రాన్స్, జర్మనీ తదితర దేశాల కేంద్ర బ్యాంకులు కూడా ఎన్నాళ్లుగానో అమెరికాలో భద్రపరుచుకున్న టన్నుల కొద్దీ బంగారాన్ని తరలించాయి. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ఐరోపా దేశాలు ఈ నిర్ణయం తీసుకోవడానికి గల కారణాలను నిపుణులు విశ్లేషిస్తున్నారు. సమీప భవిష్యత్తులో ఏదైనా తీవ్రమైన ఆర్థిక కుదుపును ఈ దేశాలు ఊహిస్తున్నాయా అనే సందేహమూ కలుగుతోంది.

యుద్ధాలు జరుగుతున్నప్పుడు, వాణిజ్యపరమైన ఉద్రిక్తతలు నెలకొన్నప్పుడు అత్యవసర పరిస్థితుల్లో ఆర్థిక ఒడుదుడుకులను తట్టుకోవడానికి బంగారాన్ని విక్రయించడం, తనఖాపెట్టడం వంటి చర్యలను వివిధ దేశాల కేంద్ర బ్యాంకులు అనుసరిస్తుంటాయి. ద్రవ్యలభ్యతను పెంచుకొని ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కడానికి కూడా ఇది దోహదపడుతుంది. అయితే నెదర్లాండ్స్ చెప్పినట్లు... సంక్లిష్ట ఆర్థిక సంక్షోభం వస్తుందా అనే ప్రశ్నకు ఇప్పటికిప్పుడు అలాంటి పరిస్థితులు లేవన్నదే నిపుణుల మాట. అయినా ... ప్రస్తుత ప్రపంచ భౌగోళిక, రాజకీయ పరిస్థితుల దృష్ట్యా ఆయా దేశాలు ముందు జాగ్రత్త పడుతున్నాయన్నది మాత్రం స్పష్టమవుతోంది. వివిధ దేశాల్లోని సాయుధ ఘర్షణలు ముఖ్యంగా రష్యా-ఉక్రెయిన్, అమెరికా-ఇరాన్ యుద్ధాలు ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణాన్ని తీవ్రతరం చేస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అన్ని దేశాలపైనా వాణిజ్య సుంకాలను విధిస్తుండడంతో ఆర్థికపరమైన అనిశ్చితీ సర్వత్రా తలెత్తుతోంది. చిరకాల మిత్ర దేశం, పొరుగునున్న కెనడాపై కూడా ట్రంప్ కాలుదువ్వుతున్న పరిస్థితుల్లో.. అమెరికాలో ప్రచ్ఛన్న యుద్ధ కాలం నుంచి నిల్వ చేసిన బంగారంపై ఐరోపా దేశాలు వ్యూహాలను మార్చుకుంటున్నాయి. సుదూరంగా కాకుండా తమకు దగ్గర్లోకి తమ బంగారాన్ని చేర్చుకుంటున్నాయి. అందుకే... అమెరికా, కెనడాలలో నిల్వ చేసిన 313 టన్నుల బంగారంలో సుమారు 86 టన్నులను నెదర్లాండ్స్ లండన్‌లోని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ ఖజానాకు చేర్చింది. న్యూయార్క్ నుంచి 111 టన్నుల బంగారాన్ని తరలించినట్లు జర్మనీకి చెందిన బుందెష్‌బ్యాంక్ కొన్ని నెలల క్రితం వెల్లడించింది. ఫ్రాన్స్ నుంచి కూడా ఇటువంటి ప్రకటనే వెలువడింది. ఇవన్నీ లండన్‌లోని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌కు ఆ మొత్తాన్ని తరలించడం గమనార్హం.

బంగారం నిల్వలకు ప్రపంచంలోనే అత్యంత సురక్షిత స్థావరంగా లండన్‌లోని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌కు శతాబ్దాలుగా పేరుంది. సెంట్రల్ లండన్‌లో కట్టుదిట్టమైన భద్రత కలిగిన భారీ నేలమాళిగలు దీనికి ఉన్నాయి. ఇక్కడ నిల్వచేసుకున్న బంగారాన్ని మరో చోటుకు తరలించాల్సిన అవసరం లేకుండానే ఏ క్షణంలోనైనా విక్రయించుకోవచ్చు. కేవలం ఖాతాలో సర్దుబాటుతో బంగారాన్ని కొనుగోలు చేయవచ్చు. విక్రయించవచ్చు. బంగారం క్రయవిక్రయాలకు లండన్ అన్నివిధాలా అత్యుత్తమమైన ప్రదేశమని వివిధ దేశాలు భావిస్తున్నందునే అమెరికా నుంచి వ్యూహాత్మకంగా నిల్వలను తరలిస్తున్నాయి. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ ఖజానాలో 5వేల టన్నుల వరకు బంగారాన్ని నిల్వ చేసే సదుపాయం ఉందని సమాచారం.

## బీఆర్ఎస్ వైఖరి మారకపోతే..

మొదటిపేజీ తరువాయి

రాష్ట్రంలో పేదలకు రేషన్ కార్డు కూడా ఇవ్వకుండానే దౌర్భాగ్య పాలన పదేళ్లపాటు సాగింది. బీఆర్ఎస్, భాజపా కార్యకర్తలకు రేషన్ కార్డు రాలేదా? సన్నబియ్యం తీసుకోవట్లేదా? రెండున్నరేళ్లలోనే రైతుల ఖాతాల్లోకి రూ. 1.60 లక్షల కోట్లు జమచేశాం. మళ్లీ ఎన్నికలకు వెళ్లేలోపు.. ఆరు గ్యారంటీలను సంపూర్ణంగా అమలు చేస్తాం. రూ. 8 లక్షల కోట్ల అప్పు ఉన్న రాష్ట్రాన్ని కేసీఆర్ మాకు అప్పగించారు. ఆ అప్పుపై అసలు, వడ్డీ చెల్లిస్తూ.. సంక్షేమం కూడా అమలు చేస్తున్నాం. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక్కసారి కూడా గ్రేడ్ 1 నియామకాలు జరగలేదు. ఇకనైనా బీఆర్ఎస్ నాయకుడి వైఖరి మారకుంటే.. మరో పదేళ్లు కూడా వాళ్లు రోడ్ల మీదనే ఉంటారు" అని శ్రీధర్ బాబు అన్నారు.

## గ్రామ నిధులు నేరుగా సర్పంచులకే అందేలా త్వరలో కొత్త బిల్లు: మంత్రి సీతక్క

మొదటిపేజీ తరువాయి

గచ్చిబౌలి: గ్రామ సర్పంచులు నిత్యం ఎదురయ్యే ఒత్తిళ్లు, విమర్శలను తట్టుకొని మానసిక స్థైర్యంతో ముందుకు సాగాలని మంత్రి సీతక్క అన్నారు. నిధుల విడుదల విషయంలో ఉప సర్పంచుల చెక్ పవర్‌కు సంబంధించి గత ప్రభుత్వ హయాంలో వచ్చిన చట్టంలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయన్నారు. ఈ అంశాన్ని ఇప్పటికే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు మంత్రి తెలిపారు. గ్రామాలకు అభివృద్ధి నిధులు ఆగిపోకుండా.. నిధులు నేరుగా సర్పంచులకే అందేలా త్వరలో అసెంబ్లీలో కొత్త బిల్లు ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు. ఆదివారం గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీస్ శాంతి సరోవర్‌లో సర్పంచుల కోసం 'సమర్థవంతమైన నాయకత్వం ద్వారా గ్రామ ప్రగతి' అనే అంశంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు.ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సీతక్క మాట్లాడుతూ.. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయడమే కాదు ప్రజల్లో నైతిక విలువలను పెంపొందించే దిశగా సర్పంచులు నాయకత్వం వహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన 9 రకాల ఆదర్శ గ్రామ అంశాలను సర్పంచులు ప్రతి ఒక్కరూ అనుసరించాలని సూచించారు. మానసిక ఆరోగ్యం పరిరక్షణ పట్ల సర్పంచులకు అవగాహన కల్పించేందుకు ఈ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రాజయోగిని బ్రహ్మకుమారి సంతోష్ దీదీ మాట్లాడుతూ.. సర్పంచులు నిస్వార్థంగా ప్రజాసేవ చేయాలని అన్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్, శాంతి సరోవర్ డైరెక్టర్ కుల్‌దీప్ తదితరులు పాల్గొన్నారు.

## వెలిగొండ ఫీడర్ కెనాల్‌లో యువకుల గల్లంతుపై మంత్రుల ఆరా

మొదటిపేజీ తరువాయి



మార్కాపురం అర్బన్: మార్కాపురం జిల్లా వెలిగొండ ప్రాజెక్ట్ ఫీడర్ కెనాల్‌లో ఇద్దరు యువకుల గల్లంతుపై మంత్రి నిమ్మల రామానాయుడు జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఫోన్‌లో మాట్లాడారు. కటకాని పల్లెకు చెందిన ఇద్దరు యువకులు గల్లంతుపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. యువకుల మృతదేహాల గాలింపు చర్యలు విస్తృతం చేయాలని ఆదేశించారు. ఫీడర్ కెనాల్‌లో నీరు వేగంగా వస్తుంది కాబట్టి, ఎవరూ కూడా నీళ్లలో దిగవద్దని తెలిపారు. నల్లమల సాగర్‌లో ఎగుడు దిగుడులు ఉండడంతో, ఎక్కడ ఎంత లోతు ఉంటుందో అంచనా వేయడం కష్టం కాబట్టి ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫీడర్ కెనాల్, నల్లమల సాగర్ దగ్గర పోలీస్, రెవెన్యూ అధికారులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

మంత్రి గొట్టిపాటి ఆరా

వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్‌లో యువకులు గల్లంతుపై మంత్రి గొట్టిపాటి రవి ఆరా తీశారు. ఎస్పీ, అధికారులతో మాట్లాడారు. యువకుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. గత రెండు రోజుల నుంచి డ్రోన్‌ల ద్వారా గాలింపు చర్యలు చేపట్టినట్లు మంత్రికి అధికారులు తెలిపారు. ఫీడర్ కెనాల్ వెంట పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలని ఎస్పీని మంత్రి కోరారు.

## గాల్లో ఉండగా సాంకేతిక సమస్య.. విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్

మొదటిపేజీ తరువాయి

టేకాఫ్ అయిన కొంత సేపటికే విమానంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో వెనక్కి తిరిగి వచ్చింది. ఈ ఘటన బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయంలో చోటుచేసుకుంది. విమానాశ్రయ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. వర్జిన్ అట్లాంటిక్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం ఆదివారం ఉదయం 8.20 గంటలకు లండన్‌కు బయల్దేరింది.

టేకాఫ్ అయిన కొద్ది సేపటికే విమానంలో సాంకేతిక సమస్య తలెత్తినట్లు గుర్తించిన పైలట్లు విమానాశ్రయ అధికారులను అప్రమత్తం చేశారు. విమానాన్ని అరగంటకు పైగా గాలిలో చక్కర్లు కొట్టించారు. అనంతరం వెనక్కి తీసుకువచ్చి విమానాశ్రయంలో ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు. ఘటన జరిగిన సమయంలో విమానంలో సిబ్బంది సహా మొత్తం 270మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రయాణికులను సురక్షితంగా కిందకు దించి, విమానాన్ని తనిఖీలకు తరలించారు. ఘటనపై డీజీసీఏ అధికారులు దర్యాప్తు చేపట్టారు.

## ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలి.. కేసీఆర్ దిశానిర్దేశం

మొదటిపేజీ తరువాయి

బీఆర్ఎస్ఎల్పీ సమావేశంలో పార్టీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. రేపటి నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో కేసీఆర్ మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాలకు అందరూ తప్పకుండా హాజరుకావాలన్నారు. శాసనసభ, మండలిలో జరిగే ప్రతి చర్చలో పాల్గొనాలి. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలి. కాంగ్రెస్, బీజేపీ విధానాలను ఉభయసభల్లో ఎండగట్టాలన్నారు.

సీఎం రేవంత్ అసెంబ్లీలో, బయట బూతులు మాట్లాడుతున్నారని కేసీఆర్ ఫైర్ అయ్యారు. పాలన చేతకాక ఈ తరహాలో వ్యవహరిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పాలన అట్టర్‌ఫ్లాప్ అని అన్నారు. కాంగ్రెస్ థర్డ్ క్లాస్ పాలన కొనసాగిస్తోంది. కాంగ్రెస్ పోవడం ఖాయమని అర్థమైంది. రేవంత్ చిల్లర మాటలు మాట్లాడుతున్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి ఖాయం. ఈ విషయం ఆ పార్టీ నేతలకు అర్థమైంది. అందుకే ఈ దోపిడీ చేస్తున్నారు. స్పీకర్ పక్షపాత వైఖరి అప్రజాస్వామికమన్నారు. సభలో స్పీకర్ పక్షపాత వైఖరితో వ్యవహరిస్తున్నారని కేసీఆర్ పేర్కొన్నారు.

బూతుల వీరుడితో చర్చకు అసెంబ్లీకి రమ్మంటున్నారు. నా చావు కోరుతూ పదే పదే మాట్లాడుతున్నారు. రాష్ట్రప్రభుత్వం అన్ని రంగాల్లో ఘోరంగా విఫలమైంది. తెలంగాణ రైజింగ్ కాదు.. డౌన్ ఫాల్ అవుతోందన్నారు కేసీఆర్ .

## హెల్త్ కార్డుల విషయంలో సీఎం నిర్ణయం సంతోషపెట్టింది: ఏపీ జేఏసీ

మొదటిపేజీ తరువాయి

అమరావతి: సెప్టెంబర్ 5న జరిగిన చర్చల్లో సమస్యలపై సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారని ఏపీ జేఏసీ ఛైర్మన్ విద్యాసాగర్ తెలిపారు. చర్చలకు సంబంధించిన వివరాలను విద్యాసాగర్ మీడియాకు వెల్లడించారు. "ఏపీజేఏసీ అతిపెద్ద వ్యవస్థ. అయితే, హెల్త్ కార్డు వ్యవస్థ సరిగా పనిచేయట్లేదు. హెల్త్ కార్డు విధానంపై సీఎంతో సమావేశంలో పట్టుబట్టాం. ఆస్పత్రుల్లో చెల్లింపులు సరిగా లేకపోవడంతో ఉద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. హెల్త్ కార్డుల విషయంలో సీఎం నిర్ణయం చాలా సంతోషంగా ఉంది.

## ఫోక్ డ్యాన్సర్ మాధురి రాథోడ్ ఆత్మహత్యాయత్నం

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: ఫోక్ డ్యాన్సర్ మాధురి రాథోడ్ ఆత్మహత్యకు యత్నించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఫ్యాన్‌కు ఉరివేసుకుంటుండగా కుటుంబసభ్యులు గది తలుపులు పగులగొట్టి ఆమెను కాపాడారు. ప్రస్తుతం మాధురి రాథోడ్‌కు ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నట్లు సమాచారం.

పెళ్లి చేసుకుంటానని చెప్పి ఫోక్ డ్యాన్సర్ ఈశ్వర్‌సాయి తనను మోసం చేశాడని.. ఫిర్యాదు చేసినా అతడిపై చర్యలు తీసుకోలేదని మాధురి ఆరోపిస్తోంది. ఈ క్రమంలోనే ఆమె మనస్తాపానికి గురై ఆత్మహత్యకు యత్నించినట్లు తెలుస్తోంది.

## నాపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన కానిస్టేబుల్‌ను అరెస్ట్ చేయాలి: కవిత



బంజారాహిల్స్: సామాజిక మాధ్యమాల్లో తనపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన చేసిన కానిస్టేబుల్‌ను సర్వీస్ నుంచి రిమూవ్ చేయకుండా రాష్ట్ర డీజీపీ సస్పెండ్‌తోనే సరిపెట్టారని తెలంగాణ రక్షణసేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత (ఖుజఊష్టు) ఆగ్రహం వ్యక్తం చేశారు. అతడిపై కేసు పెట్టి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే చర్యలు చేపట్టకుంటే.. అంతర్జాతీయ వేదికలపై ప్రభుత్వం తీరును ఎండగడతానని హెచ్చరించారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణసేన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో కవిత మాట్లాడారు.

మహిళలపై అసభ్యంగా మాట్లాడిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలో భారతీయ న్యాయ సంహిత సెక్షన్లు చెబుతున్నాయని, అవి డీజీపీకి తెలియదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడేళ్లయినా.. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు కల్లలుగానే మిగిలిపోయాయన్నారు. బీసీల కోసం ధర్నాలు చేస్తామని కాంగ్రెస్ నేతలు చెప్పడం పెద్ద జోక్ అని కవిత అన్నారు. 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి మోసం చేశారని ఆక్షేపించారు. మాజీ మంత్రి కొండా సురేఖ అంశం ఆ పార్టీ అంతర్గత విషయమన్నారు.

# షార్ట్ సర్క్యూట్‌తో వాచ్‌మన్ మృతి

## నిర్మాణ ప్రదేశంలో భద్రతా లోపాలే కారణమని కుటుంబ సభ్యుల ఆరోపణ

## ముగ్గురు చిన్నారులను ఆదుకోవాలని ప్రభుత్వానికి వేడుకోలు

**హైదరాబాద్, మోతీనగర్, సెప్టెంబర్ 5:**

హైదరాబాద్ మోతీనగర్ ప్రాంతంలో నూతన భవన నిర్మాణం జరుగుతున్న ప్రదేశంలో విషాద ఘటన చోటుచేసుకుంది. అక్కడ వాచ్‌మన్‌గా పనిచేస్తున్న మాలోత్ కోటన్న (31), తండ్రి బిచ్య కరెంట్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మృతి చెందారు.

సెప్టెంబర్ 5, 2026 రాత్రి సుమారు 7:30 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నిర్మాణ ప్రదేశంలో వాచ్‌మన్‌కు అవసరమైన కనీస సౌకర్యాలు సక్రమంగా కల్పించకపోవడం, విద్యుత్ భద్రతా చర్యలు పాటించకపోవడం, ముఖ్యంగా ఎలక్ట్రికల్ వైర్లకు పలుచోట్ల జాయింట్లు ఉండటం వంటి పరిస్థితుల కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని మృతుడి కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

కాంట్రాక్టర్, ఇంటి యజమాని నిర్లక్ష్యం వల్లే కోటన్న ప్రాణాలు కోల్పోయారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, నిర్మాణ ప్రదేశంలో విద్యుత్ భద్రతా ప్రమాణాలు పాటించారా లేదా అనే విషయాన్ని అధికారులు పరిశీలించాలని వారు కోరుతున్నారు.

మాలోత్ కోటన్నకు భార్య కల్పనతో పాటు ముగ్గురు చిన్న కుమారులు ఉన్నారు. భర్తను చిన్న వయసులోనే కోల్పోవడంతో కల్పన తీవ్ర విషాదంలో మునిగిపోయారు.



"చిన్న వయసులోనే నా భర్త నాకు దూరం కావడం తీరని లోటు. ముగ్గురు చిన్న పిల్లల భవిష్యత్తు ఎలా ఉంటుందో అర్థం కావడం లేదు" అంటూ ఆమె కన్నీరుమున్నీరుగా విలపించారు.

ప్రమాదం అనంతరం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం అంత్యక్రియల నిమిత్తం మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు.

మాలోత్ కోటన్న స్వగ్రామం జనగామ జిల్లా, కొడకండ్ల మండలం, నల్లెలగడ్డ తండా అని కుటుంబ సభ్యులు తెలిపారు.

ఈ ఘటనపై పోలీస్ యంత్రాంగం, సంబంధిత ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. ప్రమాదానికి కారణమైన పరిస్థితులను గుర్తించి, బాధ్యులుగా తేలిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

ముగ్గురు చిన్న పిల్లలతో ఉన్న మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు. కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందించడంతో పాటు, పిల్లల భవిష్యత్తుకు అవసరమైన ప్రభుత్వ సహకారం కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు.

కోటన్న మృతితో నల్లెలగడ్డ తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి.



## పులిమామిడి గ్రామంలో ఘనంగా శ్రీ రామలింగేశ్వర స్వామి జల్లి బిందె. బ్రహ్మోత్సవం.



**మన మహతి న్యూస్ ప్రతినిధి.**

నారాయణపేట జిల్లా ఉట్కూరు మండలం. పులిమామిడి గ్రామంలో వీర శైవ లింగాయత్ ల ఆధ్వర్యంలో శ్రీ రామలింగేశ్వర స్వామి జల్లి బిందె సేవను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామ పురవీధుల గుండ భాజా భజంత్రీలు,బ్యాండ్ మేళాలు, అడుగుల భజన,చెక్కభజనలతో ఊరేగించారు.ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శివనామస్మరణతో రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని మార్మోగించారు.సోమవారం ఉదయం అగ్నిగుండం, సాయంత్రం రథోత్సవం నిర్వహిస్తున్నట్లు శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

## వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు ఘనంగా సత్కారం..



**మన మహతి న్యూస్ ప్రతినిధి నారాయణపేట జిల్లా.**

మక్తల్ పట్టణంలోని సత్యసాయి ఆలయంలో వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో పత్రికా విలేకరులను ఘనంగా సత్కరించారు. వనితా క్లబ్ అధ్యక్షురాలు ప్రసన్న నేతృత్వంలో... వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపక అధ్యక్షులు కేసీ గుప్తా జన్మదిన వారోత్సవాల్లో భాగంగా... జర్నలిస్టులకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రసన్న మాట్లాడుతూ... సమాజంలో ఎలాంటి లాభాపేక్ష లేకుండా,సమాజ శ్రేయస్సు కోసం జర్నలిస్టులు అహర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు. సీనియర్ జర్నలిస్టులు మామిళ్ల పృథ్వీరాజ్, అంబాదాస్, గోవిందు, సురేశ్ గౌడ్, రఘు, సురేష్, ప్రదీప్ కుమార్, హరి కృష్ణ, కార్తీక్ సన్మానం అందుకోగా.. కార్యక్రమంలో

వనితా క్లబ్ సభ్యులు స్వాతి, వాసవీ మహిళా సంఘం మాజీ అధ్యక్షురాలు మనసాని సరళ తదితరులు పాల్గొన్నారు.

# ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

**మన మహతి న్యూస్ చుంచుపల్లి**

తెలంగాణ ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నూతన కమిటీని ఆదివారం విద్యానగర్‌లోని శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులు బానోత్ వీరు నాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, మాళోత్ రాందాస్ నాయక్, మేయర్ మూడ్ గణేష్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్‌పాషా, మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ లాల్‌సింగ్, టీయూడబ్ల్యూజే ట్రేడ్ యూనియన్--143 రాష్ట్ర ట్రెజరర్ యోగినంద, టీటీడబ్ల్యూజేఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయక్ తదితరులు హాజరయ్యారు.

జిల్లా అధ్యక్షుడిగా మాళోత్ అశోక్, ప్రధాన కార్యదర్శిగా భూక్య రాము, ట్రెజరర్‌గా బానోత్ రాందాస్, ఉపాధ్యక్షుడిగా బదావత్ దశరథ్ ఎన్నికయ్యారు. గౌరవ సలహాదారులుగా హాలావత్ రామారావు, కార్యదర్శులుగా అజ్మీరా సురేష్, బాదావత్ కోటేష్, ధరావత్ వెంకట్, బానోత్ రాము, కొర్రా శివరాం, సభ్యులుగా కృష్ణ, రంజిత్,



నాగేశ్వరావు, సైదులు, రఘురాం, బి.సురేష్, బి.రాంచందర్ ఎన్నికయ్యారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేస్తానని, జిల్లా కేంద్రంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వంతో చర్చిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మేయర్ మూడ్ గణేష్ జర్నలిస్టులు హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

గిరిజన హక్కుల సాధన కోసం జర్నలిస్టులు కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా అన్నారు. సమాజాభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర కీలకమని మార్కెట్ కమిటీ చైర్మన్ లాల్‌సింగ్ పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమం, ఇళ్ల స్థలాలు, ఆరోగ్య కార్డులు, ప్రత్యేక సంక్షేమ నిధి కోసం ఐక్యంగా పోరాడాలని టీయూడబ్ల్యూజే రాష్ట్ర ట్రెజరర్ యోగినంద, టీటీడబ్ల్యూజేఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయక్ కోరారు.

కార్యక్రమంలో ఐజేయూ జిల్లా అధ్యక్షులు బి.వెంకటరత్నం, టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు కల్లోజి శ్రీనివాస్, టీటీడబ్ల్యూజేఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు చందు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ తేజావత్ వినోద్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు మనోహర్, కార్పొరేటర్ డాక్టర్ బి.ఎస్.రావు, టీజీటీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణ్, బంజారా సంఘాల నాయకులు, జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

## ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి





**శేరిలింగంపల్లి మన మహతి న్యూస్ సెప్టెంబర్ 6:**

గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్,తాజ్ నగర్‌లో నూతనంగా నిర్మించిన దేవాలయంలో శ్రీ అభయాంజనేయ స్వామి, శ్రీ విజయ గణపతి స్వామివారి విగ్రహ ప్రతిష్టాపనలతో పాటు ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ మహోత్సవానికి గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, కమిటీ సభ్యులు గంగాధర్ రెడ్డి ని సత్కరించి, మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో బిజెపి ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు హన్మంత్ నాయక్ సీనియర్ నాయకులు విఠల్ ,వేణు ,వెంకటేష్, మహేష్, విజయ్,కృష్ణ, శ్రీశైలం ,నాగేష్, ధర్మ, వెంకన్న, నాగరాజు, సిద్దు, సాయి, కాలనీ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు, స్థానిక నాయకులు, మహిళలు, యువత, భక్తులు, తాజ్ నగర్ మరియు ఎన్టీఆర్ నగర్ పరిసర ప్రాంతాల ప్రజలు ,యువకులు,పిల్లలు,మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

## గిరిజన సమస్యలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయతో భేటీ

హైదరాబాద్: గిరిజన, బంజారా సమాజం ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు, హక్కులు, అభివృద్ధి అంశాలపై కేంద్ర మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి గారు, హర్యానా--హిమాచల్ ప్రదేశ్ మాజీ గవర్నర్, బీజేపీ సీనియర్ నాయకులు శ్రీ బండారు దత్తాత్రేయ గారితో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ జాతీయ గౌరవ అధ్యక్షులు, బంజారా భీష్మ శ్రీ అమర్ సింగ్ తిలావత్ గారి ఆధ్వర్యంలో చర్చించారు.ఈ సందర్భంగా గిరిజన, బంజారా సమాజానికి సంబంధించిన ప్రధాన సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా యువతకు విద్య, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక అభివృద్ధికి మరిన్ని అవకాశాలు కల్పించాలని కోరారు.గిరిజన సమాజ అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం నుంచి మరింత సహకారం అందించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. సమాజ సమస్యల పరిష్కారానికి తమ వంతు సహకారం అందిస్తామని నాయకులు సానుకూలంగా స్పందించారు.ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ తెలంగాణ రాష్ట్ర మీడియా సెక్రెటరీ తేజావత్ బీముడు నాయక్, గౌజ వీవఎవతీ బట్టు నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.





## శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

**మన మహతి న్యూస్ ఖమ్మం**

ఖమ్మం ఎన్టీఆర్ సర్కిల్‌లోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయుల వేషధారణలో పాఠశాలకు హాజరై తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు.



ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రావూరి నివేదిత మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యాబోధనతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, ఆత్మవిశ్వాసం, బాధ్యతాయుతమైన ఆలోచనా విధానాన్ని విద్యార్థుల్లో పెంపొందిస్తారని అన్నారు. ఆధునిక సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినా ఉపాధ్యాయుల ప్రాధాన్యత తగ్గదని పేర్కొన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కార్యక్రమంలో చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, ఏజీఎం చేతన్ మధుర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కేసీఆర్‌నుమర్యాదపూర్వకంగా కలిసిన సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్.

**సంగారెడ్డి, సెప్టెంబర్ 06,మన మహతి న్యూస్ :**

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు కేసీఆర్ అధ్యక్షతన జరిగిన బీఆర్ఎస్ఎల్పీ సంయుక్త సమావేశం అనంతరం సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఇతర ఎమ్మెల్యేలతో కలిసి కేసీఆర్ మర్యాదపూర్వకంగా కలిశారు. బీఆర్ఎస్ పార్టీ బలోపేతం, రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలు, కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు తదితర అంశాలపై




చర్చించారు. పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తూ ప్రజల సమస్యలపై మరింత సమర్థవంతంగా పోరాటం చేయాలి తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తూ, ప్రజల పక్షాన బీఆర్ఎస్ పార్టీ మరింత బలంగా పనిచేసేందుకు పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలు సమిష్టిగా ముందుకు సాగాలి సమావేశంలో మీరూ లు కొత్త ప్రభాకర్ రెడ్డి, గూడెం మహిపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# వైభవ్ వీరకొట్టుడు..
## సిరాజ్ మళ్లీ బలయ్యాడుగా..!



భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ మరోసారి విధ్వంసక ఇన్నింగ్స్ ఆడాడు. ఇప్పటివరకూ వన్డే, టీ20ల్లో మెరుపు బ్యాటింగ్‌తో అలరించిన ఈ చిచ్చరపిడుగు.. ఈసారి ఎర్ర బంతిపైనా పగబట్టినట్టే ఆడాడు. వైభవ్ బౌండరీలతో విరుచుకుపడగా టీమిండియా సీనియర్ పేసర్ మహమ్మద్ సిరాజ్ బిత్తరపోయాడు. ఐపీఎల్ అరంగేట్రం సీజన్‌లో సిరాజ్ ఓవర్లో ఎడాపెడా దంచేసిన ఈ కుర్రాడు ఇప్పుడు దులీప్ ట్రోఫీ ఫైనల్లోనూ చుక్కలు చూపించాడు. 'బౌలర్ ఎంతటివాడైనా నాకేంటీ.. నా స్టయిల్ ఇంతే'



అన్నట్టుగా చెలరేగే వైభవ్ సూర్యవంశీ మరో ఖతర్నాక్ ఇన్నింగ్స్ ఆడాడు. దులీప్ ట్రోఫీలో ఈస్ట్ జోన్ ఓపెనర్‌గా ఆడుతున్న వైభవ్ ఫైనల్లో దంచేశాడు. సౌత్ జోన్ బౌలర్లను హడలెత్తించిన ఈ పదిహేనేళ్ల కుర్రాడు.. సిరాజ్ బౌలింగ్‌లోనూ చితక్కొట్టాడు. సీనియర్ పేసర్ అయిన అతడి ఓవర్లో వరసగా 4, 6.. చివరి బంతికి బౌండరీతో రెచ్చిపోయాడీ బ్యాటింగ్ సంచలనం. దాంతో, ఐపీఎల్ 18వ సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ పేసర్‌గా ఆడిన సిరాజ్‌కు చుక్కలు చూపించిన వైభవ్.. ఇప్పుడు దులీప్ ట్రోఫీలోనూ పైచేయి సాధించాడు.

### 35 బంతుల్లోనే

రాజస్థాన్ రాయల్స్ ఓపెనర్‌గా పద్నాలుగేళ్లకే ఐపీఎల్‌లో అరంగేట్రం చేసిన వైభవ్.. గుజరాత్‌పై 35 బంతుల్లోనే మెరుపు శతకంతో చరిత్ర సృష్టించాడు. ఏకంగా 7 ఫోర్లు, 11 సిక్సర్లతో.. 265.79 స్ట్రయిక్ రేటుతో రికార్డు సెంచరీ సాధించాడు. ఇప్పుడు దులీప్ ట్రోఫీ ఫైనల్లో మియా భాయ్‌కి ఐపీఎల్ విధ్వంసాన్ని గుర్తు చేశాడు. సౌత్ బౌలర్లను భయపెడుతూ తొలి వికెట్‌కు ఓపెనర్ అభిమన్యు ఈశ్వరన్(72)తో కలిసి వంద రన్స్ జోడించిన వైభవ్.. 44 పరుగుల వద్ద ఔటయ్యాడు. అర్ధ శతకం చేజార్చుకున్నప్పటికీ రెడ్ బాల్ క్రికెట్‌లోనూ తాను మెరుపులు మెరిపించగలనని నిరూపించాడీ హిట్టర్.

# పదో శతకంతో

## విరుచుకుపడిన ఇషాన్..

## కొండంత స్కోర్ కొట్టిన ఈస్ట్ జోన్ ..!





దులీప్ ట్రోఫీ ఫైనల్లో ఈస్ట్ జోన్ కెప్టెన్ ఇషాన్ కిషన్(111 నాటౌట్) శతకంతో రెచ్చిపోయాడు. భీకర ఫామ్ కొనసాగించిన ఈ చిచ్చరపిడుగు పదో సెంచరీతో జట్టుకు భారీ స్కోరందించాడు. ఓపెనర్లు అభిమన్యు ఈశ్వరన్(72), వైభవ్ సూర్యవంశీ(44), శిఖర్ మోహన్(85)లు ఇచ్చిన శుభారంభాన్ని కొనసాగిస్తూ టీ బ్రేక్ తర్వాత కుమార్ కుషగ్ర(63 నాటౌట్)తో సౌత్ బౌలర్లపై పిడుగుల్లే విరుచుకుపడ్డాడు ఇషాన్. ఐదో వికెట్‌కు ఏకంగా సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పాడు. నింపాదిగా ఆడుతూ వీరిద్దరూ క్రీజునంటుకుపోవడంతో తొలిరోజే ఈస్ట్ నాలుగొందలకు చేరువైంది. చిదంబరం స్టేడియంలో జరుగుతున్న దులీప్ ట్రోఫీ టైటిల్ పోరులో ఈస్ట్ జోన్ బ్యాటర్లు చితక్కొడుతున్నారు. టాపార్డర్ మెరుపులతో డీలా పడిన సౌత్ జోన్ బౌలర్లను కెప్టెన్ ఇషాన్ కిషన్(111 నాటౌట్: 120 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లు) మరింత భయపెట్టాడు. శ్రేయాస్ గోపాల్ ఓవర్లో బౌండరీతో ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో పదో సెంచరీ సాధించాడు ఇషాన్. ధనాధన్ ఆడిన ఈ లెఫ్ట్ హ్యాండర్‌కు కుమార కుషగ్ర(63 నాటౌట్) చక్కని సహకారం అందించాడు. ఐదో వికెట్‌కు ఈ ద్వయం ఏకంగా 144 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పింది. దాంతో, తొలి రోజు ఆట ముగిసే సరికి ఈస్ట్ 4 వికెట్ల నష్టానికి 385 పరుగులు చేసింది.

### తొలి వికెట్‌కు వంద

టాస్ గెలిచి బ్యాటింగ్ తీసుకున్న ఈస్ట్‌కు ఓపెనర్లు అభిమన్యు ఈశ్వరన్(72), వైభవ్ సూర్యవంశీ(44) శుభారంభమిచ్చారు. భారత సీనియర్ పేసర్ సిరాజ్‌ను అలవోకగా ఎదుర్కొన్న వైభవ్ తొలి వికెట్‌కు వంద రన్స్ జోడించాడు. టెస్టులకు నేను సరిపోతానంటూ అర్ధ శతకానికి చేరువైన అతడిని మిలింద్ వెనక్కి పంపినా.. ఈశ్వరన్ పట్టుదలగా ఆడి ఫిఫ్టీ సాధించాడు. అయితే.. అనూహ్యంగా అతడు రనౌటయ్యాక.. శిఖర్ మోహన్(85) ధనాధన్ ఆడాడు.

మూడు సిక్సర్లు, 9 ఫోర్లతో 85 పరుగులు చేసిన అతడు.. ఈస్ట్ జోన్ స్కోర్ బోర్డును ఉరికించాడు. సెంచరీ దిశగా సాగుతున్న మోహన్‌ను మిలింద్ బౌల్డ్ చేయగా.. సుదీప్ కుమార్ ఘరమి(6)ని త్రిపురన విజయ్ వెనక్కి పంపాడు. అనంతరం కుమార కుషగ్ర(63 నాటౌట్)జతగా కెప్టెన్ ఇషాన్ క్రీజునంటుకుపోయాడు. సౌత్ బౌలర్లకు తన స్టయిల్ విధ్వంసం చూపించిన ఇషాన్ ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 4 వేల పరుగులు మైలురాయిని అధిగమించాడు. అర్ధ శతకంతో తర్వాత దూకుడు పెంచిన అతడు.. కాసేపటికే అజేయ శతకంతో జట్టుకు భారీ స్కోరందించాడు.

# షమిలో ఆకలి తగ్గలేదు

**ఇషాన్ కిషన్**



చెన్నై: సీనియర్ ఫాస్ట్‌బౌలర్ మహ్మద్ షమి టీమ్‌ఇండియాకు దూరమై ఏడాదిన్నర కావస్తోంది. ఏ ఫార్మాట్లోనూ అతడిని భారత జట్టులోకి ఎంపిక చేయట్లేదు. అయినా 36 ఏళ్ల షమి ఆశలు కోల్పోకుండా దేశవాళీల్లో అన్ని ఫార్మాట్లలోనూ బరిలోకి దిగుతున్నాడు. నిలకడగా రాణిస్తూ మళ్లీ టీమ్‌ఇండియాలో చోటు సంపాదించాలని గట్టిగా ప్రయత్నిస్తున్నాడు. దులీప్ ట్రోఫీ ఫైనల్లోనూ అతను ఈస్ట్ జోన్ తరఫున బరిలోకి దిగుతున్న నేపథ్యంలో ఆ జట్టు కెప్టెన్ ఇషాన్ కిషన్.. ఈ దిగ్గజ ఆటగాడి తపనను కొనియాడాడు. "అతను భారత అత్యుత్తమ ఫాస్ట్‌బౌలర్లలో ఒకడు. తనది ఆటలో దిగ్గజ స్థాయి. బెంగాల్‌కు ఆడడం మొదలుపెట్టినప్పటి నుంచి స్థిరంగా రాణిస్తున్నాడు. టీమ్‌ఇండియా తరఫునా అలాగే సత్తా చాటాడు. షమికి వయసు ఒక అంకె మాత్రమే. నిరంతరం కష్టపడుతూనే ఉంటాడు. తనలో ఆట పట్ల ఆకలి ఏమాత్రం తగ్గలేదు. కెప్టెన్‌గా తన తపనను దగ్గర్నుంచి గమనిస్తున్నా. వికెట్ల కోసం మరి కొన్ని ఓవర్లు వేయనా అని అడుగుతుంటాడు" అని ఇషాన్ అన్నాడు.

అది సవాలే కానీ..: ఫస్ట్ క్లాస్ క్రికెట్ టోర్నీ దులీప్ ట్రోఫీ ఆడిన అయిదు రోజులకే ఆసియా క్రీడల్లో టీ20 మ్యాచ్‌లు ఆడడం సవాలే అని, కానీ ప్రొఫెషనల్ క్రికెటర్లుగా ఇలాంటి వాటికి సర్దుకోవాల్సిందే అని సౌత్ జోన్ కెప్టెన్ తిలక్ వర్మ అన్నాడు. "అవును.. అయిదు రోజులు ఇక్కడ ఆడి, వెంటనే టీమ్‌ఇండియా తరఫున టీ20ల్లో బరిలోకి దిగడం సవాలుతో కూడుకున్న విషయమే. మేం దిల్లీ నుంచి జపాన్‌కు వెళ్లాక రెండు రోజుల ఖాళీనే ఉంటుంది. ఆ సమయంలోనే కొంత ప్రాక్టీస్ చేయాలి. మేం చాలా దేశవాళీ మ్యాచ్‌లు ఆడాం. ఎలాంటి పరిస్థితికైనా సర్దుకోవడం అలవాటు చేసుకున్నాం. మానసికంగా ఇలాంటి వాటికి సిద్ధంగా ఉండడంతో పాటు సరైన ఆహారం తీసుకోవడం ద్వారా శరీరాన్ని సన్నద్ధం చేసుకోవడం కూడా కీలకం. ఇలా వరుసగా వేర్వేరు ఫార్మాట్లలో ఆడిన అనుభవం మాకుంది కాబట్టి అది పెద్ద ఇబ్బంది కాదు" అని తిలక్ చెప్పాడు.

# సాత్విక్-చిరాగ్ జోడీకి
# చైనా మాస్టర్స్ టైటిల్

LI-NING CHINA MASTERS BWF World Tour Super 750




షెన్‌జెన్: భారత బ్యాడ్మింటన్ డబుల్స్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి చైనా మాస్టర్స్ సూపర్ సిరీస్ 750 టైటిల్‌ను దక్కించుకుంది.

ఆసియా పురుషుల డబుల్స్ ఫైనల్లో ప్రపంచ నం.5 సాత్విక్, చిరాగ్ జంట 11-21, 21-13, 21-17 తేడాతో హె జి టింగ్, రెన్ జియాంగ్ యు (చైనా) ద్వయాన్ని ఓడించి విజేతగా నిలిచింది. గంట 10 నిమిషాలపాటు సాగిన ఈ మ్యాచ్‌లో తొలి గేమ్‌లో భారత జోడీ నిరాశపరిచింది. తర్వాత పుంజుకున్న భారత ద్వయం రెండు గేమ్‌ల్లో దూకుడుగా ఆడి చైనా జోడీని మట్టికరిపించింది.

ఈ టోర్నీలో 2023, 2025లో రన్నరప్‌గా నిలిచిన సాత్విక్, చిరాగ్ జంట మూడో ప్రయత్నంలో చైనా మాస్టర్స్ సూపర్ సిరీస్ 750 టైటిల్‌ను దక్కించుకుంది.

# జేఎల్ఆర్‌లో 4,000 ఉద్యోగాల కోత



లండన్: టాటా మోటార్స్ అనుబంధ లగ్జరీ కార్ల తయారీ సంస్థ జాగ్వార్ ల్యాండ్ రోవర్ (జేఎల్ఆర్) యూకేలోని తన విభాగాల్లో వచ్చే రెండేళ్లలో సుమారు 4,000 మంది ఉద్యోగులను తగ్గించాలని యోచిస్తోంది. అంతర్జాతీయంగా తగ్గుతున్న అమ్మకాలు, పెరుగుతున్న ఖర్చులు, అమెరికా విధిస్తున్న కొత్త వాణిజ్య సుంకాల ప్రభావం వల్ల ఈ నిర్ణయం తీసుకోక తప్పడం లేదని సమాచారం. ఖర్చులను తగ్గించుకుని సంస్థను మరింత సమర్థవంతంగా నడపంలో భాగంగా ఉద్యోగుల కోసం కంపెనీ స్వచ్ఛంద విరమణ ప్రోగ్రామ్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపింది. జేఎల్ఆర్ ఉద్యోగాల కోత ద్వారా వచ్చే రెండేళ్లలో సుమారు 1.7 బిలియన్ పౌండ్ల (సుమారు రూ.17,000 కోట్లకు పైగా) వ్యయాలను తగ్గించుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం జేఎల్ఆర్‌కు బ్రిటన్ వ్యాప్తంగా మూడు ప్రధాన ప్లాంట్లలో సుమారు 34,000 మంది ఉద్యోగులు ఉన్నారు. తాజా ఉద్యోగాల కోత ఆఫీస్, మేనేజ్‌మెంట్ సిబ్బందికే వర్తించనుందని తెలుస్తోంది.

**భారత్‌లో ఫోక్స్‌వ్యాగన్ కోత ప్రభావం తక్కువే**

జర్మనీకి చెందిన ప్రముఖ కార్ల తయారీ సంస్థ ఫోక్స్ వ్యాగన్ మన దేశంలో వచ్చే రెండేళ్లలో 12 శాతం మంది ఉద్యోగులను తొలగించాలని యోచిస్తోంది. ఇక్కడ సంస్థకు 2300-2700 వరకు ఉద్యోగులున్నారు. ఆ లెక్కన ప్రభావం వందల సంఖ్యలోనే ఉండనుంది. అంతర్జాతీయ స్థాయిలో 50,000 మందికి ఉద్వాసన పలికే ప్రక్రియను ప్రారంభించిన ఈ సంస్థ, 2030 నాటికి మరో 50,000 ఉద్యోగాలను తగ్గించాలని, జర్మనీలోని కొన్ని ప్లాంట్లను మూసివేయాలని నిర్ణయించింది. అయితే భారత్‌ను ఒక ముఖ్యమైన తయారీ, ఎగుమతి కేంద్రంగా కొనసాగిస్తామని, ఇక్కడి ఇంజినీరింగ్ బృందాన్ని మరింతగా విస్తరిస్తామని కంపెనీ స్పష్టం చేసింది.

## ఎస్‌బీఐలో కొత్తగా 12 వేల నియామకాలు!

ప్రభుత్వ రంగానికి చెందిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ాదీ×) తన సేవలను మరింత విస్తరించనుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో 12 వేల నియామకాలతో పాటు (ాదీ× ష్టఅతీఅఅస్త్ర), కొత్తగా 250 బ్రాంచ్‌లను ప్రారంభించనున్నట్లు ఎస్‌బీఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి తెలిపారు.

ఈ ఏడాదే 11-12 వేల వరకు కొత్త నియామకాలు చేపట్టే ప్రణాళికలు ఉన్నాయని ఎస్‌బీఐ ఛైర్మన్ సీఎస్ శెట్టి వెల్లడించారు. ముఖ్యంగా క్లరికల్, ఆఫీసర్ కేడర్లలో ఇవి ఉంటాయన్నారు. ఉద్యోగుల రిటైర్మెంట్, బ్యాంక్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎస్‌బీఐకి అత్యంత భారీ నెట్‌వర్క్ ఉందని, బ్యాంక్ సేవలను మరింత విస్తరించేందుకు కొత్తగా 200 - 250 బ్రాంచ్‌లను ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు.

మార్చి 2026 నాటికి ఎస్‌బీఐలో మొత్తం ఉద్యోగుల సంఖ్య 2.45 లక్షలు దాటింది. గత ఆర్థిక సంవత్సరంలో ఈ బ్యాంక్ మొత్తం 25,633 మందిని రిక్రూట్ చేసుకుంది. మరోవైపు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ప్రతిపాదిస్తున్న రూ.30వేల కోట్ల ఐపీఓ (ఖూా)లో ఎస్‌బీఐ, దాని అనుబంధ సంస్థ ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్ లిమిటెడ్ సంయుక్తంగా 1 శాతం వాటాను విక్రయించనున్నాయి.

# 'పసిడి' రుణాల జోరు!



హైదరాబాద్: దేశ వ్యాప్తంగా బంగారు రుణాల మార్కెట్ శరవేగంగా విస్తరిస్తోంది. ఒకప్పుడు ఆర్థిక ఇబ్బందుల్లో చివరి ప్రత్యామ్నాయంగా నిలిచిన ఈ రుణాలు, ఇప్పుడు రిటెయిల్ ఆస్తుల విభాగంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్నాయి. మోతీలాల్ ఓస్వాల్ నివేదిక అంచనా ప్రకారం.. 28 శాతం వార్షిక వృద్ధి రేటుతో ఈ రంగం 2028 మార్చి నాటికి రూ.30 లక్షల కోట్ల మైలురాయిని అధిగమించనుంది. 2026 మార్చి నాటికి రూ.18.6 లక్షల కోట్లుగా ఉన్న ఈ మార్కెట్ పరిణామం, గృహ రుణాల తర్వాతి స్థానాన్ని ఆక్రమిస్తూ, రెండో అతిపెద్ద రిటెయిల్ ఆస్తి విభాగంగా నిలిచింది. వ్యక్తిగత రుణాల పోర్ట్‌ఫోలియోనూ ఇది అధిగమించడం విశేషం. 2026 ఆర్థిక సంవత్సరంలో నమోదైన 50 శాతం వృద్ధికి పసిడి ధరలు 60 శాతం మేర పెరగడమూ ప్రధాన కారణం. భారతీయ కుటుంబాల దగ్గరున్న బంగారు నిల్వలే ఈ భారీ వృద్ధికి దోహదం చేస్తున్నాయి.

**ఇళ్లల్లోనే 28,000 టన్నుల పసిడి**

ఇళ్లల్లో ఉన్న పసిడి నిల్వలు దేశ రుణ లభ్యతను పెంచే వ్యూహాత్మక వనరులుగా మారుతున్నాయి. దేశంలోని కుటుంబాల వద్ద సుమారు 28,000 టన్నుల బంగారం ఉన్నట్లు అంచనా. దీని విలువ రూ.380-390 లక్షల కోట్ల మధ్య ఉంటుంది. ఈ భారీ నిల్వలో కేవలం 8 శాతం మాత్రమే వ్యవస్థీకృత మార్కెట్ పరిధిలోకి రావడం గమనార్హం. ఇదీ ఈ రంగానికి ఉన్న విస్తృత అవకాశాలను చాటుతోంది. ముఖ్యంగా ఎంఎస్ఎంఈ సంస్థలు, అసంఘటిత రంగాలు తమ నిర్వహణ మూలధనం కోసం పసిడి రుణాలను ఎక్కువగా ఆశ్రయిస్తున్నాయి. మైక్రోఫైనాన్స్ వినియోగదారులు పొందే ఇతర రిటెయిల్ రుణాల్లో బంగారు రుణాల వాటా 18 శాతానికి చేరడం గమనార్హం.

**పాత రుణగ్రహీతలే ఎక్కువగా..**

బంగారం రుణాల్లో మరో ఆసక్తికరమైన విషయమూ ఉంది. కొత్త రుణగ్రహీతలకంటే, పాత ఖాతాదారులే పదే పదే రుణాలు తీసుకోవడం మార్కెట్ సుస్థిరతపై సందేహాలను రేకెత్తిస్తోంది. ప్రస్తుత వృద్ధి కేవలం బంగారం ధరల పెరుగుదలపైనే ఆధారపడి ఉంటుంది తప్ప వినియోగదారుల సంఖ్యలో పురోగతి కనిపించడం లేదు. ముత్తూట్ ఫైనాన్స్, మణప్పురం ఫైనాన్స్ వంటి బంగారు రుణ సంస్థలూ ఇదే విషయాన్ని పేర్కొంటున్నాయి. ఈ రెండు సంస్థల ఉమ్మడి ఖాతాదారుల సంఖ్య 90 లక్షల వద్ద, బంగారం నిల్వలు 260-265 టన్నుల వద్దే ఉన్నాయి. పోర్ట్‌ఫోలియో విలువ పెరిగినా, వినియోగదారుల బలం విస్తరించకపోవడం పరిశ్రమ ఎదుర్కొంటున్న ప్రధాన సవాలు. 2022లో 75 శాతంగా ఉన్న పాత రుణాల పునరుద్ధరణ వాటా 2025 నాటికి 82 శాతానికి చేరడం వ్యవస్థాగత నష్టభయాన్ని సూచిస్తోంది. ఇది రుణ గ్రహీతలు మరింత అప్పుల ఊబిలోకి కూరుకుపోయే ప్రమాదాన్ని వెల్లడిస్తోంది.

**దేశవ్యాప్తంగా...**

ఒకప్పుడు దక్షిణాది రాష్ట్రాలకే ఎక్కువగా పరిమితమైన బంగారు రుణాల వ్యాపారం ఇప్పుడు దేశ వ్యాప్తంగా విస్తరిస్తోంది. దేశవ్యాప్త సగటు వృద్ధి 50 శాతంగా ఉంటే, రాజస్థాన్‌లో 78 శాతం, మహారాష్ట్రలో 61 శాతం, ఉత్తరప్రదేశ్‌లో 58 శాతం వృద్ధి నమోదైంది. ఈ భౌగోళిక విస్తరణ పసిడి రుణ రంగంలో సరికొత్త పోటీకి ఆస్కారం ఇస్తోంది..

**నిబంధనలు కఠినంగా..**

పసిడి రుణ మార్కెట్‌లో నెలకొన్న ఈ పరిస్థితిని గమనిస్తున్న నియంత్రణ సంస్థలు నిబంధనలను ఎప్పటికప్పుడు కఠినతరం చేస్తున్నాయి. మార్కెట్ అదుపు తప్పకుండా చూసేందుకు ఆర్‌బీఐ పర్యవేక్షణ పెంచింది. విలువ ఆధారిత రుణం (ఎల్‌టీవీ) లెక్కింపు విధానం, రుణాల కాలపరిమితి, రుణ గ్రహీతల అర్హత ప్రమాణాలతో పాటు రుణ నిర్వహణపైనా కఠిన ఆదేశాలు జారీ చేసింది. బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల మధ్య నిబంధనల సమన్వయం వల్ల అనారోగ్యకరమైన పోటీకి అడ్డుకట్ట వేయాలని ఆర్‌బీఐ భావిస్తోంది.

**పోటీ పడుతున్న సంస్థలు**

ఈ రంగంలోని లాభాలను అందుకోవడానికి ప్రైవేట్ బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీ) సంస్థలు దూకుడు ప్రదర్శిస్తున్నాయి. బజాజ్ ఫైనాన్స్ బంగారం రుణాల విభాగం గత మూడేళ్లలో 86 శాతం వార్షిక వృద్ధి రేటును నమోదు చేస్తూ, 2026 జూన్ త్రైమాసికం నాటికి రూ.21,000 కోట్లకు చేరింది. 2027 మార్చి నాటికి రూ.30,000 కోట్ల లక్ష్యాన్ని చేరుకోవాలని



# 11 కంపెనీలు.. 7,055 కోట్లు.. ఈ వారం ఐపీఓలు ఇవే

ప్రైమరీ మార్కెట్‌లో ఈ వారమూ పబ్లిక్ ఇష్యూల సందడి కొనసాగనుంది. 11 కంపెనీలు మొత్తం రూ.7,055 కోట్ల నిధుల సమీకరించనున్నాయి. సెప్టెంబర్ 7-15 మధ్య దలాల్ స్ట్రీట్‌లో ఈ ఐపీఓలు సందడి చేయనున్నాయి. ఇందులో రెంటోమోజో, కరమ్‌తర ఇంజినీరింగ్, కనోహర్ ఎలక్ట్రికల్స్ వంటి కంపెనీలు ఉన్నాయి. తాజా షేర్లు, ఆఫర్ ఫర్ సేల్ రూపంలో షేర్లను విక్రయించనున్నాయి. ఐపీఓ నిధులను వ్యాపార విస్తరణకు, రుణాల చెల్లింపులకు, ఇతర కార్పొరేట్ అవసరాలకు పలు కంపెనీలు వినియోగించనున్నాయి. ఇక ఆ వివరాలను పరిశీలిస్తే..

**ఎస్‌బీఐలో కొత్తగా 12 వేల నియామకాలు!**

ప్రణవ్ కన్‌స్ట్రక్షన్స్ సెప్టెంబర్ 7న పబ్లిక్ ఇష్యూకు రానుంది. రూ. 351 కోట్ల నిధులను సమీకరించనుంది. సెప్టెంబర్ 9న ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ ముగుస్తుంది. ఒక్కో షేరు ధర 118-124గా కంపెనీ నిర్ణయించింది.

కనోహర్ ఎలక్ట్రికల్స్ సెప్టెంబర్ 8న ఐపీఓకు వస్తోంది. రూ.1,056 కోట్ల నిధులను సమీకరించనుంది. ధరల శ్రేణి 601-632.

ప్రసోల్ కెమికల్స్ కూడా సెప్టెంబర్ 8న ఐపీఓకు రానుంది. ధరల శ్రేణి రూ.643-676గా కంపెనీ నిర్ణయించింది. రూ.500కోట్ల నిధులను సమీకరించనుంది. రూ.80 కోట్ల తాజా షేర్లు, రూ. 420 కోట్ల ఆఫర్ ఫర్ సేల్ రూపంలో షేర్లు విక్రయించనున్నారు.

గ్లాస్ వాల్ సిస్టమ్స్ (ఇండియా) ఐపీఓ సెప్టెంబర్ 8న రూ.428 కోట్ల నిధుల సమీకరణకు ఐపీఓకు వస్తోంది. ఒక్కో షేరు ధర రూ.172-182గా కంపెనీ నిర్ణయించింది.

రెంటోమోజో సెప్టెంబర్ 9న ఐపీఓకు వస్తోంది. ఒక్కో షేరు ధర రూ.384-404 కంపెనీ నిర్ణయించింది. రూ.1,256 కోట్ల నిధులను సమీకరించనుంది. రూ.150 కోట్ల తాజా షేర్లు, రూ.1,106 కోట్ల ఆఫర్ ఫర్ సేల్ రూపంలో ఉండనున్నాయి.

కరమ్‌తర ఇంజినీరింగ్ రూ.875 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంగా సెప్టెంబర్ 9న పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. రూ.675 కోట్ల తాజా షేర్లు, రూ.200 కోట్ల ఆఫర్ ఫర్ సేల్ రూపంలో షేర్లు ఉండనున్నాయి. ధరల శ్రేణి రూ.241-254 కంపెనీ నిర్ణయించింది.

మణిపాల్ పేమెంట్ అండ్ ఐడెంటిటీ సొల్యూషన్స్ కూడా సెప్టెంబర్ 9న ఐపీఓకు వస్తోంది. రూ.805 కోట్ల నిధులను సమీకరించనుంది. ధరల శ్రేణి రూ.322-339గా నిర్ణయించింది. ఇందులో రూ.320 కోట్ల తాజా షేర్లు, రూ.485 కోట్ల ఆఫర్ ఫర్ సేల్ రూపంలో షేర్లు విక్రయిస్తున్నారు.

ఆర్సిల్ కంపెనీ రూ.733 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంతో సెప్టెంబర్ 9న పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. ఒక్కో షేర్ ధర రూ.132-139గా నిర్ణయించింది. పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ రూపంలో షేర్లు విక్రయిస్తున్నారు.

ఎల్‌సీసీ ప్రాజెక్ట్స్ ఐపీఓ సెప్టెంబర్ 9న ప్రారంభం కానుంది. రూ.427 కోట్ల నిధులను సమీకరించనుంది. ధరల శ్రేణి రూ.139-146గా కంపెనీ నిర్ణయించింది.

స్టీమ్‌హౌస్ ఇండియా రూ.414 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంతో సెప్టెంబర్ 9న ఐపీఓకు వస్తోంది. తాజా షేర్లు, ఆఫర్ ఫర్ సేల్ రూపంలో షేర్లు విక్రయిస్తున్నారు. ధరల శ్రేణి ఇంకా వెల్లడించలేదు.






# గుర్తుండిపోయేలా తెల్ల కాగితం



నక్షత్ర, రోషన్

"యువతరంతో పాటు కుటుంబ ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యే సినిమా 'తెల్ల కాగితం" అన్నారు నిర్మాత దిల్‌రాజు. హర్ష్ రోషన్, నక్షత్ర జంటగా నటించిన ఈ సినిమాని రమేశ్ బండ్రెడ్డి తెరకెక్కించారు. కృష్ణ కొమ్మాలపాటి నిర్మించారు. అజయ్, దీపక్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం అక్టోబరు 2న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం హైదరాబాద్‌లో ఈ చిత్ర టీజర్‌ను విడుదల చేశారు. నిర్మాత దిల్‌రాజు, దర్శకులు బాబీ, రామ్ అబ్బరాజు, భాను భోగవరపు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. "ఇది మనందరి కథ. పదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ చదివిన ప్రతి ఒక్కరూ కనెక్ట్ అయ్యే కథ. గుర్తుండిపోయేలా ఉంటుంది" అన్నారు హీరో హర్ష్ రోషన్.

## అలాంటి సినిమాల్ని ఎప్పటికీ అంగీకరించను!

"సినిమాల్లో మహిళలను కేవలం వస్తువులుగా చూపించడాన్ని నేను అంగీకరించను" అని అంటోంది కథానాయిక కయాదు లోహర్. కొత్తదనం నిండిన కథల్ని ఎంచుకుంటూ దక్షిణాదిలో మంచి క్రేజ్‌ను సంపాదించుకుంటోందీ తార. ఈ ఏడాది ఇప్పటికే 'ఇదయం మురళి', 'ఐమ్ గేమ్', 'ఇమ్మోర్టల్' లాంటి పలు చిత్రాలతో తెరపై మెరిసింది. ఈ నేపథ్యంలోనే ఇటీవల ఓ కార్యక్రమంలో పాల్గొన్న కయాదు.. సినిమాల్లో హీరోయిన్లను చూపించే విధానంపై కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది. "కేవలం సినీప్రియుల దృష్టిని ఆకర్షించడం కోసమే నటీమణులను అసభ్యకరంగా చూపించే చిత్రాలలో నేను భాగం కావాలనుకోవడం లేదు. మహిళలను ఓ అనవసర వస్తువులా చూపించడం నాకు అస్సలు నచ్చదు. కానీ కథకు, పాత్రకు అది అవసరమని నాకు నమ్మకం కలిగితే.. ఓ స్థాయి వరకు దాన్ని నేను అంగీకరిస్తా. అంతేకానీ దృష్టిని ఆకర్షించడం కోసం అలాంటి పనులు చేయడం నాకిష్టం లేదు. అది అప్పుడప్పుడు ఇన్‌స్టాలో ట్రెండ్ అవ్వొచ్చు. కానీ ఆ ఆలోచన నాకు ఏమాత్రం సౌకర్యవంతంగా అనిపించదు. అలాంటి సినిమాలను ఎన్నటికీ అంగీకరించను" అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఆమె ఖాతాలో 'ది ప్యారడైజ్', 'సూర్య 48' తదితర చిత్రాలున్నాయి.



## అలాంటి మాటలు అనొద్దు: డైరెక్టర్‌తో శ్రీవిష్ణు ఫన్




తనదైన కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను అలరిస్తూ, వరుస హిట్లతో దూసుకెళ్తున్నారు శ్రీవిష్ణు. ఆయన ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'కామ్రేడ్ కళ్యాణ్'. జానకీరామ్ మారెళ్ల తెరకెక్కించారు. తాజాగా ఈ సినిమా టీజర్ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఇందులో శ్రీవిష్ణు మాట్లాడుతూ డైరెక్టర్ జానకీరామ్‌పై ఫన్నీ కామెంట్స్ చేశారు. 'నువ్వు కంగారుపడకు. కంగారులో ఏవేవో వాగ్దానాలు చేయొద్దు. 'అమీర్‌పేట్ సెంటర్లో బట్టలిప్పుతా..' లాంటి మాటలు చెప్పకు' అని డైరెక్టర్‌కు సూచించారు. దీంతో వేదికపై ఉన్నవారంతా నవ్వేశారు. ఇటీవల కొన్ని చిన్న సినిమాల నటులు, దర్శకులు రిలీజ్‌కు ముందు ప్రేక్షకుల దృష్టినాకర్షించడానికి ఇస్తున్న విచిత్రమైన స్టేట్‌మెంట్లు వైరల్ అవుతున్న సంగతి తెలిసిందే. వాటిపై పంచ్ వేస్తూ శ్రీవిష్ణు ఈ వ్యాఖ్యలు చేశారు.

## అదే చేయాలనుకుంటే నేను ఐటీ ఉద్యోగంలోనే ఉండిపోయేవాణ్ని!

జయాపజయాలతో సంబంధం లేకుండా వైవిధ్యభరితమైన చిత్రాలతో ప్రేక్షకుల్ని మెప్పించే ప్రయత్నం చేస్తుంటారు తమిళ కథానాయకుడు కార్తి. అదే ఆయన్ని తెలుగు సినీప్రియులకు దగ్గరయ్యేలా చేసింది. 'సత్యం సుందరం' విజయం తర్వాత ఇప్పుడాయన నుంచి వస్తున్న కొత్త సినిమా 'సర్దార్ 2'. ఇది కార్తి - పీఎస్ మిత్రన్ కలయిక నుంచి వచ్చిన విజయవంతమైన చిత్రం 'సర్దార్'కి కొనసాగింపుగా రూపొందింది. ఇది ఈ నెల 10న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు కార్తి.

### అందుకే సర్దార్ మళ్లీ తిరిగొస్తున్నాడు..


"సాధారణంగా ఓ హిట్ సినిమా అవ్వగానే దానికి సీక్వెల్ చేయడం నా అలవాటు కాదు. కానీ, 'సర్దార్' విషయానికొస్తే ఆ పాత్రలో కొత్తగా ఆవిష్కరించడానికి చాలా కోణాలు మిగిలే ఉన్నాయనిపించింది. తొలి భాగం ముగింపులోనే పార్ట్-2కి మంచి స్కోప్ లభించింది. కొన్నాళ్ల క్రితం దర్శకుడు మిత్రన్ నా దగ్గరకొచ్చినప్పుడు 'సర్దార్' మళ్లీ ఎందుకు తిరిగి రావాలో దానికొక బలమైన ప్రయోజనాన్ని కనుగొన్నాని



చెప్పారు. అలాగే ఈసారి తొలి భాగంలో కంటే శక్తిమంతమైన ఓ విలన్ కాన్సెప్ట్‌ని సిద్ధం చేసినట్లు చెప్పాడు. ఆ కథ విన్నాక 'సర్దార్ 2' కచ్చితంగా చేయాల్సిందేనని నిర్ణయించుకున్నా. ఇందులో తొలి భాగంలోని నీళ్ల కాన్సెప్ట్ కంటే పదిరెట్లు ఎక్కువ ప్రభావం చూపే కాన్సెప్ట్ ఒకటుంది. అదేంటన్నది నేను చెప్తే బాగోదు.. తెరపై చూసి థ్రిల్ అవ్వాల్సిందే. దాదాపుగా గూఢచారి చిత్రాలన్నీ బయట దేశాల్లోనే జరుగుతుంటాయి. కానీ, ఈ సినిమాలో భారత్‌లో జరుగుతున్న ఓ సమస్యనే ఒక గూఢచారి ఎలా హ్యాండిల్ చేశాడన్నది ఆసక్తికరంగా ఉంటుంది. మొదటి పార్ట్‌లో ఉన్న ఎమోషన్స్, డ్రామాలు కొనసాగుతూనే ఈసారి యాక్షన్, స్పై అంశాలు మరోస్థాయిలో ఉండనున్నాయి".

### అదే పెద్ద సవాల్‌గా అనిపించింది

"'సర్దార్'లో తండ్రీ కొడుకుల పాత్రలు క్లైమాక్స్‌లోనే కలుస్తాయి. కానీ, ఈ రెండో భాగంలో వాళ్లిద్దరూ ఆద్యంతం కలిసే ప్రయాణిస్తారు. దీనికోసం రోజుకు రెండు గెటప్స్ మార్చి మార్చి షూటింగ్ చేయాల్సి వచ్చేది. అలా ఏక కాలంలో వృద్ధ సర్దార్ పాత్రని, తన కొడుకు పాత్రను చేయడం సవాల్‌గా అనిపించింది. దీంట్లో ఆ రెండు పాత్రలు చేసే యాక్షన్‌లోనూ చాలా వేరియేషన్ కనిపిస్తుంది. వయసు పైబడ్డ సర్దార్ పాత్ర మామూలు కుర్రాళ్లలా ఫైట్ చేయలేదు. ఆయన చాలా నైపుణ్యం ఉన్నవాడు. తన చుట్టూ ఉన్న ఏ వస్తువునైనా ఆయుధంగా మార్చుకుని పోరాడగలడు. ఓ నటుడిగా ఈ రెండు పాత్రల మధ్య వైవిధ్యతను చూపించడం మంచి అనుభవాన్నిచ్చింది".












# విటమిన్ ఎ అతిగా వద్దు



ఎంత మంచిదైనా అతి పనికిరాదు. ఇది విటమిన్ ఎ మోతాదుకు అతికినట్టు సరిపోతుంది. కళ్లు, రోగనిరోధక వ్యవస్థ, శరీరంలోని చాలా అవయవాల ఆరోగ్యానికి విటమిన్ ఎ తోడ్పడుతుంది. కానీ మరీ అతిగా తీసుకుంటే కాలేయ సమస్యల వంటి వాటికి దారితీస్తుంది. మన శరీరం సహజంగానే విటమిన్ ఎ నిల్వ చేసుకుంటుంది. అందువల్ల దీన్ని మరింత ఎక్కువగా పోగుపడేలా చేయటం మంచిది కాదు. ఇది మితిమీరితే తలనొప్పి, వికారం, తల తిప్పటం, కాలేయం దెబ్బతినటం వంటి ఇబ్బందులు తలెత్తుతాయి. విటమిన్ ఎ రూపమైన బీటా–కెరటిన్ మాత్రలను పెద్ద మొత్తంలో తీసుకుంటే కాలేయ క్యాన్సర్‌కూ దారితీయొచ్చు. ముఖ్యంగా పొగ తాగేవారికి, పొగ అలవాటుండి మానేసినవారికి, ఆస్‌బెస్టాస్ ప్రభావానికి గురయ్యేవారికి దీని ముప్పు ఎక్కువ. అందువల్ల సురక్షితంగా విటమిన్ ఎ లభించేలా చూసుకోవటమే ఉత్తమం. ఇందుకు ఆహారమే మార్గం. చేపలు, పాలకూర, క్యారెట్లు, అప్రికాట్లతో ఇది దండిగా లభిస్తుంది. ఆకుపచ్చ, నారింజ, పసుపు రంగుల్లో ఉండే కూరగాయలు, పండ్లు తినటం మంచిది. సాధారణంగా డాక్టర్లు మాత్రల కన్నా ఆహారానికే తొలి ప్రాధాన్యం ఇస్తారు. ఒకవేళ మాత్రలు వేసుకోవటం తప్పనిసరైతే సిఫారసు చేసిన మోతాదులకు కట్టుబడి ఉండాలి.

# ప్రొటీన్ కథ

మనకు అవసరమైన మూడు ప్రధాన స్థూల పోషకాల్లో ప్రొటీన్లు ఒకటి. నిజానికి శరీరంలో నీరు తర్వాత అతి ఎక్కువగా ఉండేవీ ఇవే. కండరాలు, ఎముకలు, రక్తం చర్మం, వెంట్రుకలు, గోళ్లు, మెదడు కణాలు.. ఇలా అన్నీ వీటి మీదే ఆధారపడతాయి. ఒక్కమాటలో చెప్పాలంటే శరీరానికి చోదకశక్తి ప్రొటీన్లే. అందుకే వీటికి అంత ప్రాధాన్యం.

ప్రొటీన్లు అత్యంత సంక్లిష్ట పదార్థాలు. వీటికి మూలం అమైనో ఆమ్లాలు. ఇవి రసాయన బంధాలతో కలిసి ప్రొటీన్లుగా ఏర్పడతాయి. ఒక ప్రొటీన్‌లో వందలాది అమైనో ఆమ్లాలు ఉంటాయి తెలుసా? అందుకే వీటిని శరీర నిర్మాణంలో ఇటుకల వంటివని భావిస్తుంటారు. మన శరీరంలో ఇవి చేసే పనులకు అంతే లేదు. కణాలు జన్యువులను 'చదివేలా' చేయటమే కాకుండా ఆ సమాచారంతో కొత్త కణాలు, అణువులు పుట్టుకురావటానికి తోడ్పడతాయి. ఆశ్చర్యకరంగా అనిపించినా కొత్త ప్రొటీన్ల తయారీకీ దోహదం చేస్తాయి. కణాలకు, కణజాలాలకు ఒక ఆకృతిని ఇచ్చేవీ ప్రొటీన్లే. బ్యాక్టీరియా, వైరస్‌ల వంటి హానికరాలకు అంటుకుపోయి, వాటిని ఒంట్లోంచి బయటకు వెళ్లగొట్టేలా చేస్తాయి కూడా. కాబట్టి వయసుతో నిమిత్తం లేకుండా ఆహారం ద్వారా తగినంత ప్రొటీన్ లభించేలా చూసుకోవాలి.

బాల్యం నుంచీ..

శిశువులకు, చిన్నారులకు చాలావరకూ తల్లిపాలు, పాల ఉత్పత్తుల నుంచి ప్రొటీన్ లభిస్తుంది. వయసు పెరుగుతున్న కొద్దీ ఆహారం తీరుతెన్నులు మారుతూ వస్తుంటాయి. అదృష్టవశాత్తూ శాకాహారం, మాంసాహారం రెండింటి నుంచీ తగినంత ప్రొటీన్ లభిస్తుంది. మాంసాహారంలో గుడ్డు, చేపలు, మాంసం.. శాకాహారంలో పప్పులు, గింజపప్పులు, విత్తనాలు, పాలు, పెరుగు వంటివి ప్రొటీన్ అందిస్తాయి. మాంసాహార ప్రొటీన్‌లో మన శరీరానికి అత్యవసరమైన అన్ని అమైనో ఆమ్లాలూ ఉంటాయి. అదే శాకాహార ప్రొటీన్‌లో కొన్ని అమైనో ఆమ్లాలు ఉండవు. అలాగని చింతించాల్సిన పనిలేదు. వేర్వేరు రకాల పదార్థాలు తినటం ద్వారా వీటిని భర్తీ చేసుకోవచ్చు. మనం ఆహారం ద్వారా తీసుకున్న ప్రొటీన్ జీర్ణాశయం నుంచి మొదలై పేగుల వరకూ విచ్ఛిన్న మవుతూ వస్తుంది. ప్రొటీన్ విచ్ఛినమైనప్పుడు అమైనో ఆమ్లాలుగా మారుతుంది. ఈ ఆమ్లాలు రక్తంలో కలిసి, కాలేయానికి, అక్కడ్నుంచి శరీరమంతా పంపిణీ అవుతాయి.


పెద్దమొత్తం అవసరం లేదు

ప్రొటీన్ ఎంత మంచిదైనా పెద్ద మొత్తంలో తీసుకోవాల్సిన అవసరం లేదు. ఎందుకంటే అదనపు ప్రొటీన్‌ను మన శరీరం నిల్వ ఉంచుకోలేదు. ఇది కొవ్వుగా మారటమో లేదా కిడ్నీల ద్వారా బయటకు వెళ్లటమో జరుగుతుంది. ముఖ్యంగా కిడ్నీజబ్బు గలవారికి అధిక ప్రొటీన్ చాలా కీడు చేస్తుంది. ప్రొటీన్ విచ్ఛినమైనప్పుడు పుట్టుకొచ్చే యూరియా, అమ్మోనియా, క్రియాటినైన్, యూరిక్ ఆమ్లం వంటి వాటిని బయటకు పంపటానికి కిడ్నీలు ఎక్కువ శ్రమించాల్సి వస్తుంది.

తగ్గితే ప్రమాదం

ప్రొటీన్ మరీ తగ్గితే కండరాల బలహీనత, నిస్సత్తువ, జబ్బుల నుంచి త్వరగా కోలుకోకపోవటం వంటివి తలెత్తుతాయి. వెంట్రుకలు, గోళ్లు పెళుసుబారతాయి కూడా.

గుడ్డు మంచిదే అయినా




క్రీడాకారులు, బాడీబిల్డర్లు కొన్నిసార్లు గుడ్లు ఎక్కువగా తింటుంటారు. గుడ్లలో అత్యంత నాణ్యమైన ప్రొటీన్ ఉండే మాట నిజమే అయినా పచ్చసొనలో కొలెస్ట్రాల్, కొవ్వు కూడా ఉంటాయని మరవరాదు. ఒక గుడ్డులో 186 మి.గ్రా. కొలెస్ట్రాల్ ఉంటుంది. రోజుకు మూడు గుడ్లు తినటం సాధారణంగానే పరిగణిస్తారు. అంతకన్నా ఎక్కువ తినేవారు పచ్చసొనను తీసేయటం మంచిది. దీంతో కొలెస్ట్రాల్ లేకుండానే ప్రొటీన్ లభించేలా చూసుకోవచ్చు.

సమతులంగా, సరిగా

ప్రొటీన్‌తో ఎక్కువ సేపు కడుపు నిండిన భావన కలుగుతుంది. దీంతో త్వరగా ఆకలి వేయదు. ఇలా ఎక్కువెక్కువ తినకుండా చూస్తుంది. అలాగే ఆలస్యంగా జీర్ణం కావటం వల్ల రక్తంలో గ్లూకోజు మోతాదులు ఉన్నట్టుండి పెరగకుండా చూస్తుంది. దీని మూలంగానే పిండి పదార్థాలు గణనీయంగా తగ్గించి అధిక ప్రొటీన్ ఆహార పదార్థాలు తీసుకోవటమనేది ఇటీవల ప్రాచుర్యం పొందుతోంది. నిజానికి పేగులు ఆరోగ్యంగా ఉండటానికి పిండి పదార్థాలు చాలా ముఖ్యమనే సంగతి గుర్తించాలి. పిండి పదార్థాలు పేగుల్లో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందటానికి తోడ్పడతాయి. కాబట్టి సమతులాహారం తీసుకోవటం ప్రధానం. ఆహారంలో సుమారు 30% ప్రొటీన్, 40% పిండి పదార్థాలు, 30% కొవ్వు ఉండేలా చూసుకోవటం ఉత్తమం.

ఎంత అవసరం?

వయసు, చేసే పనితీరులను బట్టి ప్రొటీన్ అవసరం ఆధారపడి ఉంటుంది. శారీరకశ్రమ అంతగా చేయని పెద్దవారికి ఒక రోజుకు తమ శరీర బరువులో ప్రతి కిలోకు సుమారు 0.8 గ్రాముల ప్రొటీన్ అవసరం. బాగా శ్రమ చేసేవారు, క్రీడాకారులకైతే 1.2 గ్రాముల నుంచి 2 గ్రాములు కావాలి. వృద్ధులు.. ముఖ్యంగా 65 ఏళ్లు పైబడ్డవారికి కండరాల మోతాదు, బలం తగ్గకుండా చూసుకోవటానికి కాస్త ఎక్కువగా.. 1 నుంచి 1.2 గ్రాములు తీసుకుంటే ప్రయోజనం కనిపించొచ్చు. కండలు పెంచుకునే బాడీబిల్డర్లకు ప్రతి కిలోకు 2.2 గ్రాములు కావాల్సి ఉంటుంది. రోజు మొత్తంలో మూడు నుంచి ఆరు సార్లు భోజనం చేయటం ద్వారా తగినంత ప్రొటీన్ లభించేలా చూసుకోవటం మంచిది.




Printed, Published & Owned by Boda prakash s/o krishna h.no 3-2 satyanarayana puram Edulapuram khammam rural Telanagana 507003 , Printed at Maddineni Nageshwara Rao , H.NO 1-17 18 , Svn Colony, Edulapuram, khammam rural Telanagana 507003, EDITOR : Boda prakash PH : 9000005078 & 9133935333 , RNI. NO TGTEL/26/A0372. EMAIL: manamahati@gmail.com